## క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు ఎంపికలు

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 13: రాష్ట్రంలోని క్రీడా పాఠశాలల్లో (4వ తరగతిలో) ప్రవేశాలకు మండల, జిల్లాస్థాయి ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడాలధికారి దామోదర్‌రెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల బాల బాలికలు ఈనెల 15వ తేదీలోపు https://tgss.telangana.gov.in వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. మెదక్‌లోని అవుట్‌డోర్ స్టేడియంలో ఎంపికలు ఉంటాయని, జిల్లాస్థాయిలో ఎంపికైన వారికి జూలై 1 నుంచి 5వ తేదీ వరకు రాష్ట్రస్థాయిలో ఎంపికలు ఉంటాయన్నారు. వివరాలకు కలెక్టరేట్‌లోని జిల్లా యువజన క్రీడల శాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

## రైతుభరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

నర్సాపూర్, జూన్13: కొత్తగా పట్టాపాస్‌బుక్కులు పొందిన రైతులు రైతుభరోసాకు దరఖాస్తు చేసుకోవాలని ఏవో దీపిక పేర్కొన్నారు. రైతుభరోసాకు జూన్ 5, 2025 వరకు కొత్తగా పట్టాపాస్‌బుక్కులు వచ్చిన వారు ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్సులను జత చేసి గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారికి అందజేయాలన్నారు.

## మాడల్ విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లు అందజేత



రామాయంపేట, జూన్ 13: రామాయంపేటలోని మాడల్ స్కూల్ విద్యార్థులకు బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్పోర్ట్స్ కిట్లు అందజేశారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ పుట్టిన రోజు సందర్భంగా జిల్లా గౌరవ అధ్యక్షుడు మెట్టు గంగారాం పంపిణీ చేశారు. మాడల్ స్కూల్ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, క్రమశిక్షణ సంఘం జిల్లా అధ్యక్షుడు పోచమ్మల గణేశ్, ఎర్రం జర్నయ్య, పోచమ్మల సత్తయ్య ఉన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

రామాయంపేట, జూన్ 13: కాట్రియాలలో పంచాయతీ కార్యాలయం వద్ద డీ.ధర్మారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గోరువెచ్చని నీటిని తాగాలని, కుళాయిల్లో నిల్వ ఉన్న నీటి పట్ల జాగ్రత్తలు వహించాలన్నారు.

## నేడు, రేపు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 13: మెదక్, హవేళీఘనపూర్, చిన్నశంకరంపేట మండలాల్లోని సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏడీఈ మోహన్‌బాబు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. శని, ఆదివారాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

## పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు పరిశీలన



నిజాంపేట, జూన్13: మండలంలోని వెంకటాపూర్(కె) గ్రామాన్ని ఆర్డీవో రమాదేవి శుక్రవారం సందర్శించారు. గ్రామంలో 1200 మందికి పైగా ఓటర్లు ఉండడంతో స్థానిక పాఠశాలలో నూతన పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు పరిశీలించినట్లు ఆర్డీవో తెలిపారు. ఆమె వెంట తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్‌ఐ ఇమాద్ ఉన్నారు.

## రోడ్డుకు అడ్డంగా ఉన్న మెట్లు తొలగించాలి



మున్సిపల్ మేనేజర్‌కు వినతి పత్రం ఇస్తున్న రైతులు

నర్సాపూర్, జూన్ 13: నర్సాపూర్‌లోని ఆరో వార్డులో రోడ్డుకు అడ్డంగా మెట్లు కడుతున్నారని, వాటిని తొలగించాలని మున్సిపల్ మేనేజర్ మధుసూదన్‌కు రైతులు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. పొలాలకు వెళ్లే దారిలో మెట్లు కడుతున్నారని, ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపారు. తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

రామాయంపేట, జూన్ 13: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై బాలరాజు తెలిపారు. సుతారిపల్లిలోని మేలుకొలుపు కార్యక్రమంలో కళాకారులతో అవగాహన కల్పించారు.

## మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

అల్లాదుర్గం,జూన్ 13: మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్‌ఐ శంకర్ అన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చారు. మద్యం తాగి పట్టుబడితే జరిమానాతో పాటు జైలు శిక్ష పడుతుందన్నారు. ద్విచక్రవాహనం నడిపేటప్పుడు హెల్మెట్ తప్పకుండా పెట్టుకోవాలన్నారు. రోడ్డు నిబంధనలు పాటించి వాహనాలు నడపాలన్నారు.

## విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

కొల్చారం, జూన్ 13: విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎస్పీ డీవీశ్రీనివాసరావు పోలీసులను హెచ్చరించారు. శుక్రవారం ఆయన కొల్చారం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరుపట్టికను పరిశీలించారు. సిబ్బంది పనితీరును ఎస్‌ఐ గౌస్ వివరించారు. అనంతరం ఠాణా ఆవరణలో శుభ్రత, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. స్టేషన్‌లోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ నేర ప్రవృత్తి కల వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా నడుచుకోవాలని, అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ట్రాఫిక్ నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని, 100కు డయల్ చేస్తే వెంటనే స్పందించి ఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు న్యాయం చేయాలన్నారు. ఆయన వెంట డీఎస్పీ ప్రసన్న కుమార్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ సందీప్‌రెడ్డి, ఇతర సిబ్బంది ఉన్నారు.

# రేషన్ కోసం పడిగాపులు



చిలిపిచెడ్: చిట్కుల్‌లో రేషన్ షాపు వద్ద లబ్ధిదారులు



చిన్నశంకరంపేట: గవ్వలపల్లిలో బస్తాలను క్యూలో పెట్టిన లబ్ధిదారులు

చిలిపిచెడ్, జూన్ 13: మండలంలోని ఆయా గ్రామాల్లో రేషన్ బియ్యం కోసం లబ్ధిదారులు పడిగాపులు కాస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి మూడు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యం ఒకేసారి పంపిణీ చేస్తున్నాయి. దీంతో ఒక్కో లబ్ధిదారుడు ఈపీడీఎస్ మిషన్‌పై ఆరుసార్లు వేలిముద్రలు వేయాల్సి వస్తుందని, ఇందుకు సుమారుగా 20 నిమిషాల కంటే ఎక్కువగా సమయం పడుతున్నదని లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు. దీంతో బియ్యం కోసం రోజుల తడిబడి రేషన్ షాపుల వద్ద ఉండాల్సి వస్తున్నదని, దీంతో తమ పనిని కోల్పోవాల్సి వస్తున్నదని వాపోతున్నారు. పిల్లలకు పాఠశాలలు, కళాశాలు, వ్యవసాయపనులు కొనసాగుతున్నాయన్నారు. కలెక్టర్, సివిల్ సప్లై జిల్లా అధికారులు చర్యలు తీసుకుని, రేషన్ దుకాణాల్లో త్వరగా బియ్యం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

### రేషన్ బియ్యానికి తప్పనితిప్పలు

చిన్నశంకరంపేట, జూన్ 13: రేషన్ బియ్యం తీసుకోవడానికి లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒకేసారి మూడు నెలలకు సంబంధించిన బియ్యం పంపిణీ చేయడంతో రేషన్ దుకాణాల ఎదుట బారులుదీరుతున్నారు. మండలంలోని గవ్వలపల్లిలో బియ్యం కోసం లబ్ధిదారులు ఉదయం నుంచి బస్తాలను క్యూలో పెట్టారు. ఒక్కొక్కసారి సిగ్నల్ రాక అటు రేషన్ డీలర్, ఇటు లబ్ధిదారులు ఇబ్బందులకు గురవుతున్నారు.

# ప్రభుత్వ నిర్మాణాలకు జీరో పర్మిట్

- జీరో పర్మిట్ సిస్టంతో ఇసుక, కంకర, మినరల్స్ కొనుగోలు చేసేలా చర్యలు
- కలెక్టర్ రాహుల్‌రాజ్



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్



కలెక్టర్‌ను కలిసిన డీసీఎస్‌వో నిత్యానంద


మెదక్, జూన్ 13 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ నిర్మాణాలకు జీరో పర్మిట్ సిస్టంతో కాంట్రాక్టర్లు ఆన్‌లైన్‌లో మైనర్, మినరల్స్, ఇసుక, కంకర కొనుగోలు చేసేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన మైనింగ్ శాఖ సమన్వయ సమావేశం నిర్వహించారు. మైనింగ్ లైసెన్సుల జారీ, ఖనిజ వనరుల నిర్వహణ, మైనింగ్ లీజుల అనుమతులు, అక్రమ మైనింగ్, ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక సరఫరా అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్టేట్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వ అభివృద్ధి పనులకు కావలసిన ఇసుక ఇండెంట్, ఇరిగేషన్, పంచాయతీరాజ్, రోడ్లు భవనాలు, తదితర శాఖల ఇంజినీరింగ్ అధికారులు జిల్లాలో ఉన్న స్టాక్ పాయింట్ల నుంచే తెప్పించుకోవాలన్నారు. అదనపు అవసరం నిమిత్తం ఇతర జిల్లాల ఇసుక రీచ్ నుంచి తెప్పించుకోవాలన్నారు. అక్రమ ఇసుక రవాణాను అరికట్టడానికి ప్రతి మండలంలో ఏర్పాటుచేసిన ఎన్ఫోర్స్‌మెంట్ బృందాలు క్రియాశీలకంగా పనిచేసి, అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలన్నారు. జిల్లాలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు అవసరమయ్యే ఇసుకను ఉచితంగా అందించాలన్నారు. దానికి అవసరమైన రవాణా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుడు భరిస్తారన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నగేశ్, ఏడీ మైన్స్ విజయకుమార్ రాజు, సంబంధిత శాఖల అధికారులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.


### జిల్లా పౌరసరఫరాల అధికారిగా నిత్యానంద

జిల్లా పౌర సరఫరాల అధికారిగా నిత్యానంద శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు. ఇప్పటి వరకు జిల్లా సివిల్ సప్లయి అధికారిగా పని చేసిన సురేశ్‌రెడ్డి యాదాద్రి భువనగిరి జిల్లాకు బదిలీ కాగా.. ఆయన స్థానంలో జగిత్యాల జిల్లా నుంచి నిత్యానంద మెదక్‌కు బదిలీపై వచ్చారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా నిత్యానంద మాట్లాడుతూ.. కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ ఆదేశాలు సలహాలు, సూచనలు పాటిస్తూ పౌరసరఫరాల శాఖ విధులను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. జిల్లాలో అందరికీ అందుబాటులో ఉంటూ సేవలందిస్తానన్నారు. ఆయన వెంట సివిల్ సప్లయి డీఎమ్ జగదీశ్ తదితరులు ఉన్నారు.

# భూ భారతిలో సమస్యలు పరిష్కారం అయ్యేనా ?







చేగుంట: ఇబ్రహీంపూర్‌లో దరఖాస్తులో పరిష్కారం కాదని రౌండప్ చేసిన అధికారులు

చేగుంట, జూన్13: భూ భారతిలో దరఖాస్తు చేసుకుని భూ సమస్యల పరిష్కరించుకోవాలని రెవెన్యూ మంత్రి, కలెక్టర్, రెవెన్యూ అధికారులు ముమ్మరంగా ప్రచారం చేయడంతో గ్రామంలో ఎన్నో రోజులుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలు తీరుతాయనికున్న రైతులకు భూ భారతిలో నిరాశే ఎదురవుతున్నది. తహసీల్ కార్యాలయ చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగినా సమస్యలు పరిష్కారం కావడంలేదు. చేగుంట మండలంలోని ఇబ్రహీంపూర్‌కు చెందిన నీల రాములుకు వారసత్వంగా వస్తున్న వ్యవసాయ భూమి సర్వే నంబర్ 454/52లో ఎకరం, 454/6లో పది గుంటలు, 343/4లో ఎకరా పది గుంటల భూమి లావణి పట్టా ఉంది. 2018లో తమకు తెలియకుండానే రికార్డుల నుంచి తొలగించారని రైతు రాములు ఆరోపించారు. గతంలో నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేయడంతో పాటు, 2018 వరకు మీ సేవ ద్వారా తీసుకున్న పహణీలు, వన్‌బీలను 2020 నుంచి, 2023, 2024లో కూడా సంబంధించి డాక్యుమెంట్లను చేగుంట తహసీల్దార్ కార్యాలయంలో అందజేసినట్లు బాధితుడు తెలిపాడు. మూడు సర్వే నంబర్లకుగాను 454/52లో ఎకరం, 454/6లో పది గుంటలకు సంబంధించి రెండు సర్వే నంబర్లను రెవెన్యూ అధికారులు తొలగించారు. 343/4కు సంబంధించిన ఎకరా పదిగుంటలకు మాత్రమే అధికారులు పరిగణనలోకి తీసుకున్నారని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. 2020 నుంచి ఆ భూమికి సంబంధించిన పత్రాలతో పలుమార్లు తహసీల్ కార్యాలయం చుట్టూ తిరిగినా సమస్య పరిష్కారం కావడంలేదని, మీ భూమిని రికార్డుల నుంచి తొలగించినప్పుడు ఏమి చేశారంటూ, ఇచ్చిన దరఖాస్తు నుంచి రెండు నంబర్లను రౌండప్ చేశారని తెలిపాడు. మీరు కబ్జాలో ఉన్నా తామేమీ చేయలేమని అధికారులు తేల్చి చెప్పినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. తమకు వారసత్వంగా 1994లో ప్రభుత్వం పట్టా పాస్‌బుక్కు ఇచ్చిందని, దానిపై బ్యాంకు రుణం కూడా పొందామని, వారసత్వంగా వస్తున్న భూమిని తమకు తెలువకుండా రికార్డుల నుంచి తొలగించడం ఎంతవరకు న్యాయమని బాధితుడు వాపోయాడు. కలెక్టర్, రెవెన్యూ అధికారుల స్పందించి తమ భూమికి సంబంధించి, సర్వే చేయించి, న్యాయంగా తమ భూమిని తమకు రికార్డులో చేర్పించి, పట్టా పాస్ బుక్కు ఇవ్వాలని బాధిత రైతు అధికారులను కోరాడు.

### మాకు న్యాయం చేయాలి



మాకు వారసత్వంగా వస్తున్న భూమిని తెలియకుండానే రికార్డుల నుంచి తొలగించారు. ఆ భూమిని రికార్డులలో చేర్పించాలని పలుమార్లు చేగుంట తహసీల్దార్ కార్యాలయం చుట్టు తిరిగినా మా భూమి సమస్యను పరిష్కరించడం లేదు. భూ భారతిలో కూడా సమస్య పరిష్కారం కావడం లేదు. కలెక్టర్, రెవెన్యూ అధికారులైనా స్పందించి మాకు న్యాయం చేయాలి.

- రైతు నీల రాములు, ఇబ్రహీంపూర్

### రైతు సదస్సుల్లో భారీగా దరఖాస్తులు

వెల్దుర్తి, జూన్ 13: గ్రామాల్లో చేపట్టిన రెవెన్యూ సదస్సులకు భారీగా దరఖాస్తులు వచ్చాయి. మండలంలోని కుకునూర్‌లో తహసీల్దార్ బాలలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వరి ఆధ్వర్యంలో, మండల కేంద్రం మాసాయిపేటలో తహసీల్దార్ జ్ఞానజ్యోతి, డిప్యూటీ తహసీల్దార్ వసంత ఆధ్వర్యంలో నిర్వహించారు. వెల్దుర్తి మండలంలోని 16 గ్రామాల్లో 1480, మాసాయిపేట మండలంలోని 9 గ్రామాల్లో 814 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్లు తెలిపారు.

### భూభారత్‌ని సద్వినియోగం చేసుకోవాలి

చిన్నశంకరంపేట, జూన్13: భూభారత్ చట్టాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ మన్నన్ సూచించారు. టి.మాందాపూర్‌లో భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు.

### కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు

టేక్మాల్, జూన్ 13: మండలంలోని ధనూర గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతులు తమ భూ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను సదస్సులో దరఖాస్తులు చేసుకున్నారు.

# పంట పొలాలకు జీవం పోసిన వర్షం



రామాయంపేట: చెరువును తలపిస్తున్న రోడ్డు



నిజాంపేటలో జోరుగా కురుస్తున్న వర్షం



రామాయంపేట: కాట్రియాలలో వాన

- రామాయంపేటలో గంటపాటు వర్షం
- చెరువులా తలపిస్తున్న మున్సిపల్ రోడ్లు

రామాయంపేట, జూన్ 13: రామాయంపేటతో పాటు మండలంలోని కాట్రియాల, అక్కన్నపేట, కోనాపూర్ తదితర గ్రామాల్లో వర్షం శుక్రవారం దంచి కొట్టింది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. రామాయంపేట–సిద్దిపేట రహదారిలో వర్షం నీళ్లకు రోడ్డు చెరువులా తలపించింది. నీళ్లు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో వాహనాలకు తీవ్ర అంతరాయం కలిగింది. గంటపాటు వాన రావడంతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగాయి. వర్షంతో పట్టణంలోని డ్రైనేజీలు రోడ్లపై ఏరులై పారుతున్నాయి. మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లో వర్షం దంచి కొట్టింది. కాట్రియాలలో నేడు మార్కెట్ కావడంతో వర్షంతో కొనుగోలుదారులు, వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు.

### కురుసిన వర్షం మురిసిన అన్నదాత

నిజాంపేట,జూన్13: నిజాంపేట మండల వ్యాప్తంగా శుక్రవారం కురిసిన వర్షంతో అన్నదాతలు మురిసిపోయారు. పంట పొలాల వద్ద మొక్కజొన్న, పెసలు, బెబ్బర్లు, కందుల విత్తనాలను విత్తడంలో రైతులు బిజీగా ఉన్నారు. సాయంత్రం వేళ కురిసిన వర్షంతో వరి నాటు వేసే పొలాల్లో వరద నీరు చేరింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

### పిడుగు పాటుతో ఒకరు మృతి

శివంపేట, జూన్ 13: పిడుగు పాటుతో ఒకరు మృతి చెందిన ఘటన శివంపేట మండలం గూడూరులో జరిగింది. గ్రామానికి చెందిన కొత్త కుమ్మరి సత్యమ్మ, కొత్త కుమ్మరి శ్రీకాంత్ ఇద్దరు పొలంలో తుకం అలకడానికి వెళ్లారు. సాయంత్రం వర్షం పడడంతో చెట్టు కిందకు వెళ్లి నిలబడ్డారు. ఆ సమయంలో పిడుగు పడడంతో సత్యమ్మకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. గాయపడిన శ్రీకాంత్‌ను హైదరాబాద్‌లోని ఓ దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు.



కుమ్మరి సత్యమ్మ (ఫైల్)

## రైతు నేస్తం కార్యక్రమానికి ఏర్పాట్లు చేయాలి



టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎస్ రామకృష్ణారావు

### సీఎస్ రామకృష్ణారావు

మెదక్, జూన్ 13 (నమస్తే తెలంగాణ) : ఈ నెల 16వ తేదీన వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరగనున్న రైతునేస్తం కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లను చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, జిల్లా కలెక్టర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. మెదక్ సమీకృత కలెక్టర్ కార్యాలయం నుంచి కలెక్టర్ రాహుల్ రాజ్, జిల్లా వ్యవసాయ అధికారి వినయ్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి రైతులతో ముఖాముఖి మాట్లాడతారన్నారు. ఆ ప్రసారాన్ని అన్ని రైతునేస్తం కేంద్రాల్లో ప్రత్యక్షంగా ప్రసారం చేస్తారని కలెక్టర్లకు తెలిపారు. రైతు ప్రతినిధులను ఆహ్వానించి, ప్రతి ప్రాంతం నుంచి కనీసం 250 మంది రైతులు హాజరయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమాన్ని సముచితంగా నిర్వహించాలని కలెక్టర్లను ఆయన కోరారు. ఈ కార్యక్రమం ద్వారా రైతులు వ్యవసాయ నిపుణులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. ఇప్పటివరకు 500 కేంద్రాల్లో అందుబాటులో ఉన్న వీడియో కాన్ఫరెన్స్ సదుపాయాన్ని విస్తరించి, ఈ నెల 16 నుంచి అదనంగా మరో 1000 కేంద్రాల్లో అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. ఈ సదుపాయం ద్వారా నిపుణులు ఏయే పంటలు వేసుకోవాలి, ఆధునిక సాగు విధానాల గురించి రైతులకు తరచూ సూచనలు, సలహాలు ఇస్తారని సీఎస్ చెప్పారు. వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు మాట్లాడుతూ, ఈ కార్యక్రమం కోసం ప్రతి రైతునేస్తం కేంద్రంలో సంబంధిత క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారితో పాటు మండల స్థాయి అధికారిని నియమించాలని కలెక్టర్లను ఆదేశించారు. కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించాలని సూచించారు.

# సత్ఫలితాలిస్తున్న హరితహారం



నిజాంపేట, జూన్ 13: మండలంలోని కల్వకుంట నుంచి నార్లపూర్‌కు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ఐదేండ్ల క్రితం కేసీఆర్ హయాంలో హరితహారంలో నాటిన గుల్మోహర్ మొక్కలు సత్ఫలితాలిస్తున్నాయి. నేడు వృక్షాలుగా మారి ఆకర్షణీయమైన ఎరుపు వర్ణపు పుష్పాలతో వాహనదారులు, బాటసారులు ఆహ్లాదాన్ని పొందుతున్నారు.

## న్యాయశాస్త్ర పట్టభద్రులకు స్టైఫండ్‌తో కూడిన శిక్షణ

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 13: జిల్లాలోని షెడ్యూల్డ్ కులాలకు చెందిన న్యాయశాస్త్ర పట్టభద్రులకు 3 ఏండ్లు స్టైఫండ్‌తో కూడిన శిక్షణ ఇప్పించనున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారిణి విజయలక్ష్మి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల ఏడాది ఆదాయం రూ.2 లక్షలకు మించరాదన్నారు. కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలతో పాటు డిగ్రీ, న్యాయశాస్త్ర విద్య పట్టా, బార్ అసోసియేషన్ రిజిస్ట్రేషన్, ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్ ప్రతులతో http://telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్‌లో ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# చెరువులో పడి బాలుడి మృతి



సతీశ్ మృతదేహం వద్ద రోదిస్తున్న దృశ్యం

అల్లాదుర్గం, జూన్ 13: చెరువులో పడి బాలుడు మృతి చెందిన ఘటన అల్లాదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని అప్పాజిపల్లిలో శుక్రవారం జరిగింది. ఎస్‌ఐ శంకర్ కథనం ప్రకారం.. ఘనపురం సాయిలు తన కుటుంబసభ్యులతో కలిసి జగద్గిర్‌గుట్టలో పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈ నెల 5న పని నిమిత్తం స్వగ్రామైన అప్పాజిపల్లికి భార్య, ఇద్దరు కొడుకులతో కలిసి వచ్చాడు. సాయిలు చిన్న కొడుకు సతీశ్(14) శుక్రవారం గ్రామంలోని చెరువులో చేపలు పట్టడానికి వెళ్లాడు. జారి చెరువులో పడి మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని జోగిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

# బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయరాదు

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 13: బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయవద్దని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి ప్రజలకు సూచించారు. మున్సిపాలిటీల్లో వందరోజుల ప్రత్యేక ప్రణాళికలో భాగంగా పట్టణంలోని 25వ వార్డులో తడి, పొడి చెత్తపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పారిశుధ్య నిర్వహణపై తీసుకోవాల్సిన జాగ్రతలను ప్రజలకు వివరించారు. 6, 19వ వార్డుల్లోని మురుగు కాల్వలు, గుంతల్లో దోమల నివారణకు ఆయిల్ బాల్స్ వేశారు. డీఈ మహేశ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

# ముంబై సముద్రంలో పడి యువకుడి మృతి



రాము (ఫైల్)

రామాయంపేట, జూన్ 13: ముంబై సముద్రంలో కుటుంబంతో బోటు షికారు చేసిన యువకుడు అలల తాకిడికి నీటిలో కొట్టుకుపోయి మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రామాయంపేటలోని ఎస్సీ కాలనీకి చెందిన టంకరి రాము (26) ముంబైలోని తన అక్క ఇంటికి వేసవి సెలవుల నిమిత్తం మంగళవారం వెళ్లాడు. ముంబైలో బుధవారం అక్క ఇద్దరు కూతుర్లు, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి సముద్రంలో షికారు చేశారు. ఒడ్డుకు వస్తున్న క్రమంలో ఒక్కసారిగా పెద్ద అలలు రావడంతో రాము సముద్రంలో కొట్టుకుపోయాడు. గజ ఈతగాళ్లు అదేరోజు రాత్రి మృతదేహాన్ని బయటకు తీశారు. శుక్రవారం పోస్టుమార్టం తర్వాత మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

# చిన్ననాటి స్నేహితుల ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న చిన్ననాటి స్నేహితులు

చిన్నశంకరంపేట, జూన్13: బాధిత కుటుంబానికి చిన్ననాటి స్నేహితులు శుక్రవారం ఆర్థిక సాయాన్ని అందజేశారు. మండలంలోని కామారం గిరిజన తండా ఆటో డ్రైవర్ యాదగిరి గుండెపోటుతో మృతి చెందాడు. ఈ విషయం తెలిసిన జాతీయ మానవ హక్కుల మండలాధ్యక్షుడు సిరి గద్దె దామోదర్ ఆధ్వర్యంలో యాదగిరి చిన్ననాటి స్నేహితులు తలాకొంత వేసుకుని బాధిత కుటుంబానికి రూ.5500 అందజేశారు.